సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 9 । జనవరి । 2023

గరిష్ఠం / కనిష్ఠం
31° / 13°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం, రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉంటుంది. పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) అశోక చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉచిత న్యాయ సహాయం పొందాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంరూరల్‌: పేదలందరూ ఉచితంగా న్యాయసహాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామం లెప్రసీ కాలనీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్యాయానికి గురై ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు దరఖాస్తు ఇస్తే న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. మహిళలు రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించాలని పేర్కొన్నారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులు ఆర్డీఓ కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని, 30 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి బి.రామారావు వినియోగదారుల హక్కుల చట్టం, గిఫ్ట్‌ డీడ్స్‌ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కొత్తగూడెం బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద్‌రావు, సీనియర్‌ న్యాయవాదులు కె.పుల్లయ్య, గోదా రామచంద్రారెడ్డి, మండల లీగల్‌ సర్వీసెస్‌ మెంబర్స్‌ తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, ఎండి సాధిక్‌పాషా, కాసాని రమేష్‌, రమణ, పాతూరి విఠల్‌, రమణ, ఎస్‌ఐ ప్రవీణ్‌, డిప్యూటీ తహసీల్దార్‌ అంజర్‌పాషా, సర్పంచ్‌లు కవిత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్‌: కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు లభించిందని రాష్ట్ర టూరిజం చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన వాసవీ క్లబ్‌ జిల్లా కేబినేట్‌ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ రాజకీయంగా ఆర్యవైశ్యులకు పదవులిచ్చారని తెలిపారు. ఉప్పల్‌ భాగాయత్‌లో ఐదెకరాల భూమి కూడా ఇచ్చారని చెప్పారు. ఆర్యవైశ్యులు వ్యాపారంలోనే గాక సామాజిక కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉండాలన్నారు. వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో ఏఐఎస్‌ చదువుతున్న 23 మందికి ఆర్థిక సాయం అందించామని చెప్పారు. సమావేశంలో వాసవి క్లబ్‌ ప్రతినిధులు యాద నాగేశ్వరరావు, దోసపాటి వెంకటేశ్వరరావు, దారా మల్లికార్జున రావు, కేబినేట్‌ కార్యదర్శి దార నర్సింహారావు, కోశాధికారి గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, దోసపాటి లక్ష్మి, ఉప్పల శారద, జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్‌ కొత్తూరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మన్నించు తల్లీ..



పెద్దమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల రద్దీ (ఫైల్‌)

పెద్దమ్మతల్లి ఆలయంపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం

- ఇన్‌చార్జి ఈఓలతో నెట్టుకొస్తున్న పాలన
- అరకొర వసతులతో భక్తులకు తప్పని ఇక్కట్లు
- కనీసం తాగునీరు కూడా అందుబాటులోలేని వైనం
- ఆదాయం మాత్రం ఏటా రూ.3 కోట్లపైనే

రోజుకు వెయ్యి నుంచి 2 వేల మంది వరకు భక్తులు దర్శించుకుంటారు. ఆదివారమైతే ఆ సంఖ్య 15 వేల నుంచి 20 వేల వరకు ఉంటుంది. ఏటా రూ.3 కోట్లకుపైగానే ఆదాయం వస్తుంది. కానీ భక్తులకు సౌకర్యాలు ఉండవు. రెగ్యులర్‌ ఈఓను నియమించరు. ప్రస్తుతం పాలకవర్గం కూడా లేదు. వెరసి పెద్దమ్మతల్లి అమ్మవారి వద్దకు వచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు.

పాల్వంచరూరల్‌: భక్తుల కొంగుబంగారమైన పెద్దమ్మతల్లి (శ్రీకనకదుర్గ) ఆలయంపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రెగ్యులర్‌ ఈఓను నియమించకపోవడంతో ఇన్‌చార్జీల పాలనలో కాలం గడుస్తోంది. ఇటీవల కొంతకాలంగా పాలకవర్గం కూడా లేదు. భక్తులకు సరైన సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. రోజూ వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునే భక్తులు సౌకర్యాల లేమిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా రూ.3 కోట్ల ఆదాయం ఉన్నా..

జిల్లాలో భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం తర్వాత అధిక ఆదాయం కలిగిన ఆలయంగా పెద్దమ్మ తల్లి గుడి పేరొందింది. భక్తులకు అమ్మే టికెట్లు, కొబ్బరిచిప్పలు, అద్దెలు, తలనీలాలు, హుండీ ద్వారా ఏటా దేవాదాయ శాఖకు సుమారు రూ.3 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది. ఇంత ఆదాయం ఉన్నా దేవాదాయ శాఖ, పాలకవర్గాలు భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. ఆలయం ప్రాంగణంలో మహిళా భక్తులు స్నానాలు చేసేందుకు గతంలో నిర్మించిన ఆరు బాత్‌రూమ్‌లను కూల్చివేశారు. దీంతో భక్తులకు స్నానాల గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులోలేక ఇక్కట్లు పడుతున్నారు. గుడికి ఎదురుగా రోడ్డు దాటివెళ్తే ఐటీడీఏ నిర్మించిన పది బాత్‌ రూమ్‌లు ఉన్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో కూడా భక్తులకు అర్థం కాదు. ఆచూకీ దొరకబట్టి అక్కడకు వెళ్లినా.. ఆదివారం భక్తుల సంఖ్య 15 వేలకు మించుతుండటంతో పది బాత్‌ రూమ్‌లు సరిపోవడం లేదు. అమ్మవారి సన్నిధిలో కనీసం తాగునీరు కూడా దొరకదు. దుకాణాల్లో కొనుగోలు చేసి తాగాల్సిందే. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఒకే క్యూలైన్‌ ఉండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఆలయానికి ఎదురుగా చెట్ల కింద నైవేద్యం వండుకునేవారు. వంటవార్పు చేసుకునేవారు. ఇప్పుడా చెట్లు నరికించి భవన నిర్మాణం చేపట్టారు. దీంతో భక్తులు నైవేద్యం వండుకునేందుకు కూడా ఇబ్బందులు తప్పడంలేదు. భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా దేవాదాయ శాఖ మౌలిక సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.



ఇప్పటివరకు పనిచేసిన ఈఓల జాబితా

కోరిన కోరికలు తీర్చే తల్లి..

పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారు కొలువై ఉన్నారు. ఇక్కడికి జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. రోజూ వెయ్యి నుంచి 2 వేల మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. గురు, ఆదివారాల్లో రద్దీ మరింతగా ఉంటుంది. ప్రతి గురువారం 5 వేల నుంచి 10 వేల లోపు, ప్రతి ఆదివారం 15 వేల నుంచి 20 వేల లోపు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని దేవాదాయ శాఖ అధికారులే చెబుతున్నారు.

22 మందిలో ఐదుగురే రెగ్యులర్‌ ఈఓలు

ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చాక 22 మంది ఈఓలుగా పనిచేశారు. ఇందులో ఐదుగురే రెగ్యులర్‌ ఈఓలు. మిగిలిన 17 మంది ఇన్‌చార్జీలే. ప్రస్తుత ఈఓ కూడా ఇన్‌చార్జే. ఉమ్మడి వరంగల్‌ జిల్లా పాలకుర్తి దేవాలయం ఈఓకు పెద్దమ్మగుడి ఈఓగా గత నవంబర్‌ నుంచి అదనపు బాధ్యతలు అప్పగించారు. కొద్దిరోజులు పాలకుర్తి ఆలయంలో, మరి కొన్ని రోజులు పెద్దమ్మగుడి వద్ద విధులు నిర్వర్తించాల్సి రావడంతో ఆలయ, పూజాది కార్యక్రమాల పర్యవేక్షణ కరువైంది. ఇన్‌చార్జి ఈఓల కారణంగానే ఆలయంలో అవినీతి ఆరోపణలు రావడంతో గత నెలలో విచారణ కూడా నిర్వహించారు. పాలకవర్గ పదవీకాలం కూడా గత అక్టోబర్‌ 9వ తేదీతో ముగిసింది. నెల రోజుల క్రితం నూతన పాలకవర్గం కోసం నోటిఫికేషన్‌ జారీచేసినా ఇంతవరకు నియామకం జరగలేదు. దీంతో ఆలయం అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా దేవాదాయ శాఖ స్పందించి భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, రెగ్యులర్‌ ఈఓను, నూతన పాలకవర్గాన్ని నియమించాలని భక్తులు కోరుతున్నారు.

సారొస్తున్నారు..

- ఎట్టకేలకు సీఎం కేసీఆర్‌ పర్యటన ఖరారు
- 12న నూతన కలెక్టరేట్‌ ప్రారంభోత్సవం
- కొత్త భవనాన్ని పరిశీలించిన కలెక్టర్‌ అనుదీప్‌



సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌ రావు జిల్లా పర్యటన ఎట్టకేలకు ఖరారైంది. ఈ నెల 12న మొదట మహబూబాబాద్‌ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించనున్నారు. సక్రాంతి పండుగ అనంతరం ఈ నెల 18న ఖమ్మం నూతన కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్‌ అనుదీప్‌ వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి ఆదివారం నూతన కలెక్టరేట్‌ను సందర్శించారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా గోదావరి వరదల నేపథ్యంలో సీఎం కేసీఆర్‌ గత జూలై 17న భద్రాచలం పర్యటనకు వచ్చారు. సుమారు రెండు మాసాల నుంచి నూతన కలెక్టరేట్‌, మెడికల్‌ కళాశాల, బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం సమయం కోసం వేచిచూస్తున్న తరుణంలో ఎట్టకేలకు పర్యటన ఖరారైంది. ఇప్పటికే మెడికల్‌ కళాశాల ప్రారంభం కాగా.. ఇప్పుడు నూతన కలెక్టరేట్‌ ప్రారంభానికి అధికారిక సమాచారం వచ్చింది. బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయం ప్రారంభానికి మాత్రం ఇంకా ఎలాంటి సమాచారం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్‌ రేగా కాంతారావు క్యాంపు వర్గాలు తెలిపాయి. సీఎం పర్యటన నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌ కుమార్‌ సోమవారం జిల్లాకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించనున్నారు. హైదరాబాద్‌ పర్యటనలో ఉన్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ముఖ్యమంత్రి నుంచి సమాచారం అందిన వెంటనే హుటాహుటిన కొత్తగూడెం చేరుకున్నారు. నూతన కలెక్టరేట్‌ ప్రాంగణంలో కలెక్టర్‌ అనుదీప్‌తో ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు భారీగా జన సమీకరణకు బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రణాళిక రూపొందించనున్నారు. ఆకస్మికంగా సీఎం పర్యటన తేదీలు ఖరారు కావడంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. కార్యక్రమం విజయవంతానికి అవసరమైన కార్యాచరణ సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌ కుమార్‌ సమక్షంలో ఖరారు కానుంది.




నూతన కలెక్టరేట్‌ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌, కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వనమా

పొత్తు లేకపోతే.. అన్ని చోట్లా పోటీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్‌: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌తో పొత్తు లేకపోతే అశ్వారావుపేట సహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ పోటీ చేసేందుకు సిద్ధమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. అశ్వారావుపేటలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించాయి. పార్టీ కార్యాలయం నుంచి రింగ్‌ రోడ్‌ సెంటర్‌, బస్టాండ్‌ సెంటర్‌, గాంధీ బొమ్మ సెంటర్‌ మీదుగా ఎర్ర జెండాలతో ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తో పొత్తు అవగాహన ఐతే ఉంది కానీ ఇంకా ఆ దిశగా చర్చలు జరగలేదన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీలు వేస్తున్నామని, అశ్వారావుపేటతో సహా దాదాపు 40కి పైగా నియోజకవర్గాల్లో తమకు బలమైన అభ్యర్థులు ఉన్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు అంటే శిరస్సు వంచినట్లు కాదని పేర్కొన్నారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని కొంతమంది చేస్తున్న పనికిరాని వ్యాఖ్యలు సరికాదని కొట్టిపారేశారు. ఎర్ర జెండా పార్టీలు పేదలు, కార్మికుల పక్షానే పోరాటాలు చేస్తాయని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు వేల ఏళ్ల చరిత్ర ఉందన్న సంగతి మరిచిపోవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌ పాషా, జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కర్‌రావు, ఎస్‌డీ సలీమ్‌, గన్నిన రామకృష్ణ, ఎస్‌కే రఫీ, తిర్మాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్లలు దాటినా..



జన్మభూమిపై తగ్గని మమకారం

- విద్యాభివృద్ధికి ఇతోధిక సహాయం
- సామాజిక సేవలో పలువురు ఎన్‌ఆర్‌ఐలు

ప్రవాస భారతీయులు సొంతూరితోపాటు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. పాఠశాలలను బాగు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వైద్యం, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్నారు. అనాథలు, వృద్ధులకు అండగా నిలుస్తున్నారు. సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నేడు భారతీయ ప్రవాసీ దివస్‌ సందర్భంగా ప్రత్యేక కథనం..

–భద్రాచలం/బూర్గంపాడు

సామాజిక సేవలో సూదిరెడ్డి బ్రదర్స్‌..



నర్సాపురంలో సూదిరెడ్డి సోదరులు నిర్మించిన పాఠశాల భవనం



ప్రారంభిస్తున్న నాటి సీఎం వైఎస్సార్‌(ఫైల్‌)

దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్‌ కంపెనీ నిర్వహకుడిగా, ఆయన సోదరుడు సూదిరెడ్డి వీరారెడ్డి కార్డియాలజిస్టుగా పేరు ప్రఖ్యాతులు పొందారు. వీరు తాము చదువుకున్న పాఠశాలకు మూడెకరాల్లో రూ.1.23 కోట్లతో అన్ని సదుపాయాలతో కూడిన భవనం నిర్మించారు. విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, కంప్యూటర్‌ తరగతి గదులు, ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చారు. ఈ పాఠశాల భవనాన్ని 2004లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర రెడ్డి స్వయంగా ప్రారంభించారు. సూదినేని బ్రదర్స్‌ ఏటా పాఠశాలకు వచ్చి యూనిఫాంలు, షూలు ఇతర సామగ్రి అందిస్తూ ఉంటారు. వారి తోడ్పాటుతో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు ఆధునిక విద్య అందుతోంది.

భద్రాచలం నుంచి తానా అధ్యక్షుడిగా నన్నపనేని



భద్రాచలంలో మోహన్‌ నిర్మించిన పాఠశాల భవనం



భద్రాచలానికి చెందిన నన్నపనేని మోహన్‌ 2015–17 వరకు తానా అధ్యక్షుడిగా పనిచేశారు. భద్రాచలంలో తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన కొర్రాజుల గుట్ట పాఠశాలలో సుమారు రూ.కోటి వ్యయంతో భవనం నిర్మించారు. 2003లో ప్రారంభించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను సమకూర్చారు. ఆ పాఠశాల ఇప్పటివరకు ఎంతో మందిని ఉన్నత స్థానంలో నిలిపింది. శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో శారద కుటీర్‌ను నిర్మించి భక్తుల వసతి కోసం అంకితం చేశారు. నన్నపనేని మోహన్‌ ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఏజెన్సీ సేవా తత్పరుడు జయశేఖర్‌..

బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తాళ్లూరి జయశేఖర్‌ 2019 నుంచి 2021 వరకు తానా అధ్యక్షుడిగా పనిచేశారు. తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్‌ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి 17 ఏళ్లుగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. బూర్గంపాడు మండలంలోని ఎంఎస్‌ఆర్‌ పబ్లిక్‌ స్కూల్‌లో, న్యూస్కాలర్‌ స్కూల్‌లో ప్రతిఏటా 150మంది పేద విద్యార్థులకు ఫీజులు, యూనిఫామ్స్‌ సమకూర్చుతున్నారు. విద్యార్థులకు డిజిటల్‌ విద్యాబోధన కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. భద్రాచలంలో సరస్వతి శిశుమందిర్‌ పాఠశాల, సారపాకలో హోమియో ఆస్పత్రి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. భద్రాద్రి బాలోత్సవ్‌, జాతీయస్థాయి నాటకోత్సవాలతోపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. భద్రాచలంలో దివ్యాంగుల కోసం బ్రష్‌ స్కూల్‌ నిర్మాణం చేపట్టారు. ఇలా ఎన్నెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.



స్కూల్‌ పిల్లల ఫీజుల చెక్కు అందిస్తున్న తాళ్లూరి జయశేఖర్‌



క్లుప్తంగా

'చర్చా వేదిక'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పాయం సత్యనారాయణ

చర్ల: భద్రాచలం పట్టణాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 45పై చర్చించేందుకు ఈ నెల 10 నిర్వహించనున్న చర్చా వేదికకు ఆదివాసీ ప్రముఖులంతా హాజరుకావాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దేవరాపల్లిలో పరిషత్ సీనియర్ నాయకులు కారం సీతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ భవనంలో ప్రారంభమయ్యే ఈ చర్చా వేదికకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జీఎస్‌పీ నాయకులు తెల్లం జనార్దన్, తెల్లం శ్రీధర్, పాయం రమణయ్య, పొడియం సారయ్య, నాగమణి, లక్ష్మీదేవి, తెల్లం సమ్మక్క, నాగేశ్వరావు, కొర్సా నాగేశ్వరావు, తెల్లం అంజలి, కాకా సారక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రెజర్ బాంబు నిర్వీర్యం



బాంబును నిర్వీర్యం చేసిన భద్రతా బలగాలు

చర్ల: మండలంలోని కొండెవాయి సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును చర్ల పోలీసులు నిర్వీర్యం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు కొండెవాయి అటవీ ప్రాంతంలో పోలీసులను లక్ష్యంగా చేసుకొని ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సీఐ అశోక్‌కుమార్ నేతృత్వంలో బాంబ్ డిస్పోజబుల్ టీం ఆ ప్రాంతానికి చేరుకొని బాంబును నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మావోయిస్టులు చేపడుతున్న ఇటువంటి వికృత చేష్టలకు మూగజీవాలతో పాటు ఆదివాసీల ప్రాణాలు కూడా పోతున్నాయని చెప్పారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఖండించాలని ఆయన కోరారు.

వరి కుప్పకు నిప్పు..

సుమారు రూ.1.20 లక్షల ఆస్తి నష్టం



దహనమైన వరి కుప్ప

చర్ల: మండల కేంద్రంలోని తాటిగుంపులో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పంటించారు. ఈ ఘటనలో వరి కుప్ప పూర్తిగా దహనం కాగా బాధిత రైతు కుటుంబానికి సుమారు రూ.1.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తాటిగుంపుకు చెందిన గందం ఆదిలక్ష్మి రెండెకరాల భూమి కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేయగా, పంట కోసి వరి కప్ప వేసింది. మరో నాలుగైదు రోజుల్లో కళ్ల వేయాలనుకుంటున్న సమయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పటించి దహనం చేశారు. ఆదివారం ఉదయం కుప్ప వద్ద మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి చేరుకునే లోగా పూర్తిగా దహనమైంది. దీంతో బాధిత మహిళా రైతు లబోదిబోమంటున్నారు. సంఘటనా ప్రాంతాన్ని మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ సందర్శించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక సీపీఎం మండల కార్యదర్శి కారం నరేష్‌తో పలు పార్టీల నాయకులు బాధితులను ఓదార్చారు.

న్యూడెమోక్రసీ నాయకుడి అరెస్ట్



మోరె రవి

అశ్వాపురం: మణుగూరు మండలం సాంబాయిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మణుగూరు డివిజన్ కార్యదర్శి మోరె రవిని ఆదివారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామం వద్ద ఎస్సై జితేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అతనిని వెంబడించి పట్టుకుని సోదా చేయగా తుపాకీ లభించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. తుపాకీ స్వాధీనం చేసుకొని అశ్వాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో భారత ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. రవిపై గతంలో అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లలో పలు సెక్షన్ల కింద వివిధ కేసులు నమోదయ్యాయని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఇక మస్టర్ల లెక్క పక్కా..!

జనవరి 1 నుంచి కేంద్రం కొత్త నిబంధనలు

- ఆన్‌లైన్‌లోనే కూలీల హాజరు నమోదు
- పనుల్లో మరింత పెరగనున్న పారదర్శకత
- ఈ ఏడాది 43.56 లక్షల పని దినాలు పూర్తి
- రూ.104 కోట్ల మేర నిధులు ఖర్చు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతిసారి ప్రభుత్వాలు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నప్పటికీ అవకతవకలు తగ్గడంలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధిహామీ పథకాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు తాజాగా కేంద్రప్రభుత్వం కూలీల హాజరు నమోదును ఆన్‌లైన్‌లో పక్కాగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఉపాధి కూలీల ఆన్‌లైన్ హాజరు ప్రక్రియను జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ విధానంలో రోజువారీ ఉపాధి పనులకు వచ్చే కూలీల వివరాలను నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో ఉపాధి సిబ్బంది మస్టర్ల పద్ధతిన పనుల వద్దకు వెళ్లి కూలీల వివరాలను నమోదు చేసుకునేవారు. కానీ ప్రస్తుతం నేరుగా లైవ్ లొకేషన్‌లో మొబైల్ ద్వారానే ఆన్‌లైన్‌లో హాజరు నమోదుతో పాటు కూలీల వారు చేపడుతున్న ఉపాధి పనుల వివరాలు సైతం అందులో పొందుపరచాల్సి ఉంటుంది.

అవకతవకలకు చెక్..

కొన్ని చోట్ల ఉపాధి పనులు చేపట్టకున్నా చేసినట్లు చూపడం, కూలీల హాజరు శాతం ఎక్కువగా చూపడం వంటివి జరిగేవి. దీనివల్ల ప్రతి ఏడు నిర్వహించే సామాజిక తనిఖీల్లో భారీగా అవకతవకలు బయటపడేవి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కొన్నేళ్లుగా ఉపాధి పనుల వివరాలు జియోట్యాగ్ కూడా చేస్తున్నారు. అయినప్పటికీ కూలీల హాజరులోనూ పకడ్బందీగా ఉండాలన్న కేంద్రం ఆలోచనతో లైవ్ లొకేషన్ హాజరును తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రతి కూలీ పనుల వద్ద ఉంటేనే హాజరు నమోదవుతుంది. ఒక వేళ 20 మందికి పైగా ఉపాధి పనులకు వెళితే అక్కడి నుంచి ఉదయం, సాయంత్రం యాప్ ద్వారా ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు ఆదేశించడంతో ఆ దిశగా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పన..

జిల్లాలో ఉన్న 481 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2,30,041 కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉన్నాయి. వాటి పరిధిలో 4,98,102 మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధి పనుల తీరుతెన్నులను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. పలు కొత్త రకాల సంస్కరణలను తెచ్చి ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర ప్రభుత్వ పెత్తనానికి చెక్ పెట్టింది. దానిలో భాగంగా గ్రామాల్లో ముందుగా ప్రతిపాదించిన 20 పనులను పూర్తి చేసిన తర్వాతే మిగిలిన కొత్త పనులు చేపట్టేలా సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఉపాధి హామీ పథకంలో 17 విభాగాల్లో 250పైగా పనులను చేపట్టవచ్చని సూచిస్తుంది.

చేసే పనులివే..

పనుల ఎంపిక విషయంలో స్థానికంగా ఉన్న స్థితిగతులను బట్టి అధికారులు నిర్ణయిస్తారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు, భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, వ్యవసాయ, చిన్ననీటి కుంటల ఏర్పాటు, చెక్‌డ్యాంల నిర్మాణం, కాల్వల పూడిక తీత వంటి పనులతో పాటు పశువుల పాకలు, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, పొలం గట్లపై టేకు చెట్ల పెంపకం, బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చడం వంటి పనులు ఉన్నాయి. ఇక సామాజిక పనులైన రహదారులు, మట్టిరోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, నర్సరీల నిర్వహణ, హరితహారంలో మొక్కల పెంపకం వంటి వాటికి కూడా అవకాశం కల్పిస్తున్నారు.

రూ.104 కోట్లు నిధులు ఖర్చు..

జిల్లాలో ఈ ఏడాది 65.61 లక్షల ఉపాధి పని దినాలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 43.56 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. ఈ ఏడాది ఉపాధిహామీ పథకంలో మొత్తం 999 కుటుంబాలు ఇప్పటివరకు 100 రోజుల పనిదినాలను పూర్తి చేశాయి. ఉపాధి పనుల నిమిత్తం రూ.104.59 కోట్ల నిధులను ఇప్పటివరకు అధికారులు ఖర్చు చేశారు. ఇందులో రూ.75.66 కోట్లు ఉపాధి కూలీలకు వేతనాలుగా చెల్లించగా, రూ.21.95 కోట్లను మెటీరియల్ నిమిత్తం వెచ్చించారు. మిగిలిన రూ.6.98 కోట్లను ఇతరాత్ర అవసరాలను వినియోగించారు.

పారదర్శకత పెరుగుతుంది..



ఉపాధి కూలీల ఆన్‌లైన్ హాజరు ద్వారా మస్టర్లు పక్కాగా నమోదవుతాయి. ఈ ప్రక్రియ రోజుకు రెండుసార్లు చేపట్టాల్సి ఉంటుంది. దీని ద్వారా ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత మరింత పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉపాధి పనుల జియోట్యాగ్ పద్ధతిలో పనులు చేపడుతున్నాం. జనవరి 1 నుంచి ఉపాధి కూలీల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. – సుబ్రహ్మణ్యం, ఏపీడీ

చిన్ననాటి జ్ఞాపకాలకు వేదికగా '6కే రన్'



6కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ వినీత్



బహుమతులు పొందిన విద్యార్థులతో జీఎం

సింగరేణి(కొత్తగూడెం) / కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని సెంట్రల్ పార్క్‌లో సెయింట్ జోసెఫ్ హై స్కూల్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం 6కే రన్ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలం సెంట్రల్ పార్క్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు కొనసాగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ జి.వినీత్, కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు హాజరై టార్చ్ వెలిగించి స్కూల్ ఫ్లాగ్ ఊపి 6కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న నాటి నుంచే తరగతి గదిలో చెప్పినా పాఠాలను ఇంటి దగ్గర కూడా చదివి నేర్చుకోవాలని తద్వారా జరిగే పరీక్షలలో మంచి మార్కులు సాధిస్తారన్నారు. పూర్వపు విద్యార్థులు, ఒక దగ్గర కలుసుకొని చిన్న నాటి జ్ఞాపకలు గుర్తుచేసుకోవడానికి ఒక వేదికగా మారిందన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీ రోజు రన్నింగ్, వాకింగ్, యోగ వంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు, పూర్వ విద్యార్థులు, వివిధ స్కూళ్ల నుంచి 400 వరకు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. అక్కడ నిర్వాహకులు ఏర్పాటు చేసిన సక్సెస్ 6కే రన్ సందర్భంగా ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులను జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పాఠశాల వజ్రోత్సవాలు ఫిబ్రవరి 4,5 తేదీలలో నిర్వహిస్తున్న సందర్భంగా 6కే రన్ నిర్వహించామని పేర్కొని పాల్గొన్న వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సింగరేణి యాజమాన్యం, అటవీ శాఖ అధికారులు, స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ శౌరెడ్డి, డాక్టర్ రోజా కిరణ్, ఓఎస్ఏ అధ్యక్షులు,జనరల్ సెక్రటరీ కవిత, గౌతం ఫారెక్, షేక్‌స్పియర్, మొబిన్ పాషా, డాక్టర్ మాలతీ, ఎల్.జె. ప్రవీణ్, బి.కిరణ్, డీవీ కోటి రెడ్డి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది..

నేను సెయింట్ జోసఫ్ పాఠశాలలో 1963లో చేరినప్పటి నుంచి నేటి వరకు ఎంతోమంది ఐఏఎస్, ఐఆర్ఎస్, సింగరేణి సంస్థలో డైరెక్టర్లు, డాక్టర్లు అయ్యారు. సుమారు 60 ఏళ్ల తర్వాత కలుసుకోవటం చాలా ఆనందంగా ఉంది. విద్య వ్యాపారంగా మారుతున్న నేటి కాలంలో నైతిక విలువలతో కూడిన విద్యను ఈ పాఠశాల అందిస్తుంది.

– గౌతంఫారెక్, పూర్వ విద్యార్థి

భవిష్యత్ తరాలకు దిక్సూచి..

సాహితీ, సాంస్కృతిక, క్రీడా, విద్యా విషయాలలో తనదైన ముద్రవేసి భవిష్యత్ తరాలకు దిక్సూచిలా పాఠశాలలోని విద్యార్థులకు విద్యను అందిస్తున్నాం. ఎంతో మందిని అభివృద్ధి పథంలో నడిపించి విజయ శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహిస్తున్నాం. 6కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాం.

– రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకుని, తలనీలాలు సమర్పించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అంజన్న సన్నిధిలో రాములోరి రాపత్తు సేవ



రామయ్యకు పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం : రామయ్య స్వామికి పాదదాసుడైన అంజనేయస్వామి సన్నిధిన ఆదివారం రాపత్తు సేవ వైభవోపేతంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని పల్లకీలో ఊరేగింపుగా మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ బ్రిడ్జి రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకొని వచ్చారు. అంజన్న సన్నిధిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి హారతిని సమర్పించారు. భక్తులకు ప్రసాదాలను నైవేద్యంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జయభారతి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల యాజమాన్యం డా.సుదర్శన్, డా.జయభారతిలతో పాటు ఆలయ అర్చకులు, పండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనం'తో ఐక్యత చాటాలి



నృత్యం చేస్తున్న పలు పార్టీల నాయకులు

జూలూరుపాడు: ఆత్మీయ సమ్మేళనాలతో బంజారా జాతి ఐక్యతకు చాటాలని, దీనికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బంజారా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడు కేజీబీవీ ఎదురుగా ఉన్న మామిడి తోటలో బంజారాల గోర్ మాటి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై లంబాడీ గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పలువురు వక్తలు మాట్లాడారు. జాతి సంస్కృతి, సంప్రదాయాలు బంజారుల ధర్మ రక్షణ కోసమే ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్, పలు పార్టీల నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, భూక్యా వీరభద్రం నాయక్, బానోత్ విజయ బాయి, ధరావత్ రాంబాబు నాయక్, గుగులోత్ ధర్మ నాయక్, బంజారా జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా దేవీలాల్ నాయక్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'నిర్విరామ సంగీత లహరి' సక్సెస్..



గాయకులకు సర్టిఫికెట్, మెమెంటోలను అందజేస్తున్న ప్రముఖులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం వేదికగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ దశమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నిర్విరామ సంగీత లహరి కార్యక్రమం విజయవంతమైంది. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పలు రాష్ట్రాల గాయకులు 111 మంది గాయకులు పాల్గొని ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్విరామంగా పాటలు పాడి అలరించారు. అనంతరం పాటలు పాడిన ప్రతి గాయకుడికి నిర్వాహకులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెమెంటోలను ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, సోమరౌతు శ్రీనివాస్, వరలక్ష్మి, సాయిరాం, విజయరావు, కృష్ణ చైతన్య, మాధవరెడ్డి, అశోక్‌కుమార్, నాగరాజు, పోకల శ్రీనివాస్, పద్మావతి, జ్యోతి, తిప్పన సిద్దులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ములకలపల్లి: కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మండలపరిధిలోని గుట్టగూడెం గ్రామశివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బాల్దె సురేశ్ కథనం ప్రకారం.. గుట్టగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3వేలు నగదులతో పాటు ఐదు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై..

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి, అల్లిపల్లి గ్రామల మధ్యలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మందలపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులకు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,110 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

దొంతికుంటలో..

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని దొంతికుంట వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు స్థానిక ఎస్సై రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,040 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

ఏన్కూరు: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయి కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన వరద బోయిన పృథ్వీరాజ్ (24) కొన్నేళ్లుగా ఏన్కూరులో స్వీట్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ మద్యానికి బానిసై తిరుగుతూ ఆదివారం ఏన్కూరులోని అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సాయికుమార్ పృథ్వీరాజ్ భౌతికకాయానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంగా ఖిల్లా..

- ముగ్గురు యువకుల దుర్మరణంతో విషాదఛాయలు
- కలచివేసిన కుటుంబ సభ్యుల రోదనలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి పువ్వాడ
- మరణంలోనూ వీడని స్నేహబంధం



ప్రమాద వివరాలు ఆరా తీస్తున్న మంత్రి అజయ్‌కుమార్



ఇంద్దాత్(ఫైల్), సమీర్(ఫైల్), యాసిన్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: కారు ప్రమాదం జరిగిన ఘటనలో ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో ఆ ప్రాంతం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలతో ఖిల్లా శోకసంద్రంగా మారింది. ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇంద్దాత్ (21), షేక్ సమీర్ (21), షేక్ యాసిన్ (18), అర్షద్ అలీ, షేక్ కరీమ్, షేక్ సల్మాన్, మహ్మద్ అత్తార్, షేక్ ఆరీఫ్, మహ్మద్ సోహైల్ ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. వారంతా స్నేహితులు, బంధువులు. సోహైల్ సోదరి ఒలిమా ఫంక్షన్‌కు ఇన్నోవా కారులో హైదరాబాద్‌లోని మొయినాబాద్ వెళ్లి తిరిగి ఖమ్మం వస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత విజయవాడ-హైదరాబాద్ 65వ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం యరసానిగూడెం గ్రామ శివారులో డివైడర్‌కు తగిలి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు పల్టీ కొట్టడంతో కారులోని ఇంద్దాత్, షేక్ సమీర్, షేక్ యాసిన్‌లు అక్కడికక్కడే మరణించారు. ఇక డ్రైవర్ అర్షద్ అలీ, ఎస్‌కే కరీమ్, ఎస్‌కే సల్మాన్‌లకు తీవ్ర గాయాలు కాగా.. ఎండీ సోహైల్, ఎండీ అత్తార్, ఎస్‌కే ఆరీఫ్ లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కుటుంబ భారాలను మోసేవారే..

కారు ప్రమాదంలో మరణించిన యువకులు పేద కుటుంబాలకు చెందిన వారే. వారు పని చేస్తేనే కుటుంబాలను పోషించేందుకు వీలుంటుంది. మహ్మద్ ఇంద్దాథ్, షేక్ సమీర్, షేక్ యాసిన్ ముగ్గురు ఒకే వీధిలో కుటుంబాలతో అద్దె గృహాల్లో నివాసముంటున్నారు. ఇంద్దాత్ తండ్రి మరణించడంతో కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు. పదో తరగతి వరకు చదివి కుటుంబ భారం మీద పడటంతో చదువును వదిలేసి టైల్స్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సమీర్ తండ్రి ఆరోగ్యం సరిగా లేకపోవడం, అన్నకు పెళ్లై వేరు కాపురం పెట్టడంతో కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత తనపై పడింది. యాసిన్ పేద కుటుంబానికి చెందిన వాడే కావడంతో ముగ్గురూ టైల్స్ పని చేసేవారు. ప్రతిరోజూ స్నేహితులు అందరూ కలిసి పనులకు వెళ్లి వచ్చి సాయంత్రం వేళ వీధిలో అందరినీ పలకరిస్తూ సంతోషంగా గడిపేవారు. స్నేహితుడి చెల్లి వివాహ విందు కావడంతో కారులో వెళ్లి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తమను పోషించే బిడ్డ దూరమయ్యాడని, తమకు దిక్కెవరని ఆ కుటుంబాల రోదనలు మిన్నంటాయి. నిత్యం తమతో సరదాగా మాట్లాడుతూ ఉండే పిల్లలు మరణించారనే వార్తను చుట్టుపక్కల వారు జీర్ణించుకోలేకపోయారు. ఇక చేతికి అందివచ్చిన కొడుకులను కోల్పోయిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.కాగా, విషయం తెలుసుకున్న మంత్రి అజయ్‌కుమార్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించగా.. ఆయన పీఏ సీహెచ్ రవికిరణ్ మృతుల కుటుంబసభ్యులకు అందించారు. వారి వెంట సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ అలియా షౌకత్ అలీ, ఖమర్, తాజుద్దీన్, తౌసిఫ్, అక్మల్ అలీ, జిలానీ, కాఫిల్, ఇసాక్ ఉన్నారు.